కబ్జా కోరల్లో సర్వేపల్లి రిజర్వాయర్

రెండు మండలాల సాగునీటి అవసరాలకు ప్రధానమైన రిజర్వాయర్ ఇది. అధికారుల పట్టింపు లేకపోవడంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రిజర్వాయర్ చుట్టూ ఉన్న గ్రామాల్లోని కొందరు రైతులు ఏటా కొంత భూమిని ఆక్రమించి వరిసాగు చేస్తున్నారు. ఆక్రమిత భూములకు రిజర్వాయర్ నీటినే అక్రమంగా తరలించేందుకు కాలువలు తవ్వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లుగా ఉండదంతో పలు విమర్శలు వస్తున్నాయి.

- ఏటా పెరుగుతున్న ఆక్రమణలు
- చేతులు మారుతున్న ఆక్రమిత భూములు
- పట్టించుకోని అధికారులు


గొలగమూడి సమీపంలోని రిజర్వాయర్‌లో అక్రమంగా చేపట్టిన సాగు

వెంకటాచలం : వెంకటాచలం, ముత్తుకూరు మండలాల సాగునీటి పంపిణీకి సర్వేపల్లి రిజర్వాయర్ ప్రధానమైనది. ఈ రిజర్వాయర్ నుంచి రెండు మండలాల్లో 20 వేల ఎకరాలకు సాగునీరు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే రిజర్వాయర్ విస్తీర్ణం 15 వేల ఎకరాలు కాగా ఏటా పైభాగంలో ఆక్రమణలతో రిజర్వాయర్ కుదించుకుపోతోంది. ఆక్రమణల గురించి ఆయకట్టు రైతులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. 2011వ సంవత్సరంలో రిజర్వాయర్ ఆక్రమణలపై నలుగురు సర్వేయర్లతో సర్వే చేయించారు. అప్పట్లో 300 ఎకరాలకు పైగా ఆక్రమణలు ఉన్నట్లు సర్వేలో తేల్చి ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి వదిలేశారు. అప్పటి నుంచి మళ్లీ రిజర్వాయర్ ఆక్రమణల గురించి నీటిపారుదలశాఖ, రెవెన్యూశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమిత భూముల అమ్మకాలు

సర్వేపల్లి రిజర్వాయర్‌ను ఆక్రమించి సాగు చేసుకుంటున్న భూములను పలువురు అమ్మకాలు చేసుకుని సొమ్ము చేసుకున్నారు. రిజర్వాయర్ భూములను అనికేపల్లి, గొలగమూడి, కంటేపల్లి, జోసఫ్‌పేట తదితర గ్రామాల వ్యక్తులు కొన్నేళ్లుగా అక్రమసాగు చేసుకుంటున్నారు. ఈ భూములకు యంత్రాలతో చుట్టూ గట్లు వేయించి మోటార్ల ద్వారా రిజర్వాయర్ నీటినే అక్రమంగా పంపిణీ చేస్తుండగా ఎకరాకు దిగుబడి నాలుగు పుట్లకు తగ్గడంలేదు. దీంతో ఈ భూములను కొందరు వ్యక్తులు ఎకరా రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలకు కొనుగోలు చేసి సాగు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. కొందరు ఆక్రమిత భూములకు సాగునీటి కోసం నగం రిజర్వాయర్ నుంచి ఇష్టారాజ్యంగా కాలువలు తవ్వేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణేదీ..?

రిజర్వాయర్‌లో ఏటా ఆక్రమణలు పెరిగిపోతున్నా నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. అనికేపల్లి, గొలగమూడి గ్రామాల పరిధిలో ఏటా రిజర్వాయర్‌లో పోటాపోటీగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ఈవిషయం అధికారులకు తెలిసినా తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆక్రమిత భూముల కారణంగా ఆయకట్టు పొలాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నా, అధికారుల్లో చలనం లేకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. రిజర్వాయర్ సగంలో నుంచి యంత్రాలతో కాలువలు తవ్వుతుంటే ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రిజర్వాయర్‌లో ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.


రిజర్వాయర్‌ను ఆక్రమించి కంటేపల్లి రైతులు చేపట్టిన సాగు

అక్రమ కేసులకు భయపడేది లేదు

- వైఎస్సార్‌సీపీ నాయకుల వెల్లడి

పొదలకూరు : టీడీపీ నాయకుల అక్రమ కేసులు, దౌర్జన్యాలకు భయపడేది లేదని, న్యాయపోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పేర్కొన్నారు. సంగం ఆనకట్ట కనుపూరు కాలువ వద్ద గొడవ తర్వాత నాయకులు విరువూరు గ్రామంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకుల దౌర్జన్యాలు మితిమీరిపోయినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధిగా మాజీ మంత్రి కాకాణి కనుపూరు కాలువను పరిశీలించకూడదా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో సోమిరెడ్డి నక్కల కాలువను పరిశీలిస్తే మా పార్టీ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేయలేదన్నారు. టీడీపీ నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకుని తమపై దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. కాలువ వద్ద టీడీపీ నాయకులు రాళ్లతో తమపై దాడి చేసేందుకు వచ్చారని ఆరోపించారు. పోలీసులు సైతం తమను


మాట్లాడుతున్న సురేష్‌కుమార్‌రెడ్డి

బలవంతంగా విరువూరుకు పంపించి వేశారని అధికార పార్టీకి చెందిన వారికి వత్తాసు పలికినట్టు పేర్కొన్నారు. బయటి వారు తమ గ్రామానికి వచ్చి జులుం ప్రదర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో దశకంఠాద్రిశర్మ మాట్లాడారు. అనంతరం కాకాణి చిత్రపటానికి పాలాభిషేకం చేసి నినాదాలు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీలు విజయకుమార్, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సునామీపై మాక్‌డ్రిల్


సునామీ హెచ్చరికలు చేస్తున్న తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి

ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం పంచాయతీ ఆర్కాట్‌పాళెంలో సునామీ సంభవించే అంశంపై మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. పోలీస్, మెరైన్, వైద్య, రెవెన్యూ శాఖల సిబ్బందితో పాటు కృష్ణపట్నంపోర్టు సెక్యూరిటీ, మెడికల్, ఫైర్ విభాగం కూడా కార్యక్రమంలో పాల్గొంది. సునామీ వచ్చినప్పుడు తుఫాన్ షెల్టర్లు వంటి ఎత్తయిన ప్రదేశాల్లో, ఇంటి మిద్దెలపై తలదాచుకోవాలని అధికారులు సూచించారు. బాధితులను ఏ విధంగా రక్షించాలి, క్షతగాత్రులకు ఎటువంటి వైద్య సదుపాయం అందించాలి.. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్ జరిపి, స్థానికులను చైతన్యవంతం చేశారు. నెల్లూరు ఆర్డీఓ నాగసంతోష్ అనూష, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎస్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ షెట్టి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి వీరశేఖర్, వైద్యాధికారులు ప్రమోద్ బెనెటిక్, దేవీ కృప, గ్రామ కాపులు పాల్గొన్నారు.


క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేస్తున్న సిబ్బంది

టీడీపీ నేతల వికృత చేష్టలు

- గమేశాలో ఆధిపత్యం కోసం భయభ్రాంతులు

కొడవలూరు: మండలంలోని రాచర్లపాడు సీమెన్స్ గమేశా ఫ్యాక్టరీలో ఆధిపత్యం కోసం స్థానిక టీడీపీ నేతలు వికృత చేష్టలకు దిగుతున్నారు. వాస్తవానికి ఈ ఫ్యాక్టరీలో పవన విద్యుత్‌కు అవసరమయ్యే బ్లేడ్లు.. మోటార్ల తయారీకి సంబంధించిన రెండు ప్లాంట్లను వేర్వేరుగా నిర్వహించేవారు. బ్లేడ్ల తయారీ ప్లాంట్‌లో రెండు వేల మంది.. మోటార్ల తయారీ ప్లాంట్‌లో రెండు వందల మంది కార్మికులు పనిచేసేవారు. దేశవ్యాప్తంగా సీమెన్స్ గమేశా బ్లేడ్ల తయారీ కేంద్రాలను మూసేశారు. ఇదే సమయంలో ఇక్కడా ఇదే పరిస్థితి. ప్రస్తుతం ఇక్కడి మోటార్ తయారీ ప్లాంట్‌లో పనిచేసే వారందరూ చెన్నైకు సంబంధించిన కార్మికులే. హౌస్ కీపింగ్ కాంట్రాక్ట్‌నూ చెన్నైకు చెందిన సంస్థకే అప్పగించినా, ఆ పనులకు మాత్రమే స్థానికులకు అవకాశం కల్పించారు. హౌస్ కీపింగ్‌లో పనిచేసే వారిలో కొందర్ని గత ప్రభుత్వ హయాంలో స్థానిక నేతల సిఫార్సుపై నియమించారని స్థానిక టీడీపీ నేతలు నమ్ముతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా మూతపడిన సీమెన్స్ గమేశా బ్లేడ్ల తయారీ కేంద్రాల సామగ్రిని రాచర్లపాడులోని ఫ్యాక్టరీలోకి మార్చాలని నిర్ణయించారు. తరలించిన విలువైన సామగ్రిని పర్యవేక్షించేందుకు గానూ స్థానికంగా ఉన్న ఓ వ్యక్తిని నియమించారు. సదరు వ్యక్తిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చెప్పినట్లుగా నియమించారని టీడీపీ నేతలు భావించారు. ఏ విధంగానైనా ఫ్యాక్టరీలో తమ ఆధిపత్యం కొనసాగాలని నిర్ణయించుకున్నారు. స్థానికులకు అవకాశం కల్పించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే సాకును చూపుతూ అధికారులను ఫ్యాక్టరీలోకి వెళ్లనీయకుండా దూషిస్తూ మంగళవారం అడ్డుకున్నారు. ఫ్యాక్టరీ వద్ద ధర్నాను బుధవారం చేపడతామని హెచ్చరించారు. ఏ విధంగానైనా తమ ఆధిపత్యం కొనసాగేలా చేసుకోవాలనే ఉద్దేశంతో అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.


అధికారులను లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్న టీడీపీ నేతలు

కలుపును నివారించుకోవాలి


పొదలకూరు: పులికల్లులో క్షేత్ర సందర్శన చేసిన అధికారులు

పొదలకూరు : రైతులు కలుపు మొక్కలను నివారించుకోవాలని ఏఓ ఎ.వాసు సూచించారు. మండలంలోని పులికల్లు, పార్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ క్షేత్ర సందర్శన చేసి రైతులతో మాట్లాడారు. పలు సూచనలు చేశారు. సస్యరక్షణపై సలహాలు, సూచనలు చేశారు. ఏఈఓ ఏడుకొండలు నాయక్, పట్టు పరిశ్రమ అధికారి మస్తానయ్య, వీపీఏలు శ్రీనివాసతేజ, సాయిగణేష్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

తోటపల్లిగూడూరు : యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరి సాగులో అధిక దిగుబడులను సాధించవచ్చని ఏడీఏ మారుతీదేవి అన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాళెంలో మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, మండల ఏఓ శిరీషారాణి, వీపీఏలు షర్మిల, కావేరి పాల్గొన్నారు.

విడవలూరులో..

విడవలూరు : స్థానిక రైతుసేవా కేంద్రంలో మండల ఏఓ పి.వెంకటకృష్ణయ్య మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. సబ్సిడీపై విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం క్షేత్రసందర్శన చేపట్టారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ అరుణ పాల్గొన్నారు.

కొడవలూరు: సరైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా తొలి దశలో వచ్చే తెగుళ్లు, పురుగుల నుంచి వరి పైరును కాపాడుకోవచ్చని కోవూరు ఏడీఏ సుజాత పేర్కొన్నారు. మండలంలోని గండవరం, గౌతమ్‌నగర్‌లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు హాజరైన ఆమె మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగిస్తే రైతులకు మేలు చేకూరుతుందని చెప్పారు. పంట బీమా ఆవశ్యకతను తెలియజేశారు. ఏఓ లక్ష్మి, ఏఈఓ వెంకట్రావు, జేవీఓ వెంకటేశ్వర్లు, వీపీఏలు కవిత, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: నారుమడులను ఎత్తయిన ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవడం ద్వారా పెరుగుదల బాగా ఉండటంతో పాటు అధిక వర్షాలొచ్చిన సమయాల్లో రక్షించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి రఘునాథ్ పేర్కొన్నారు. మండలంలోని దేవిస్‌పేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.


విడవలూరులో..


కొడవలూరు: గండవరంలో..


ఇందుకూరుపేట: దేవిస్‌పేటలో..

పరీక్షలకు 371 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 371 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 5,695 మంది విద్యార్థులకు 5324 మంది హాజయ్యారని తెలిపారు.

సీఐ శివరామకృష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ

పొదలకూరు : పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శివరామకృష్ణారెడ్డి తన కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వీఆర్ నుంచి ఇక్కడకు సీఐగా బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న రాంబాబు వీఆర్‌కు వెళ్లారు. గతంలో శివరామకృష్ణారెడ్డి పొదలకూరు సీఐగా పనిచేసిన అనుభవం ఉంది. 2016–18 మధ్యకాలంలో మూడేళ్ల పాటు ఇక్కడ పనిచేశారు.

విద్యుత్ బిల్లులు ఇవ్వండి సారూ

మనుబోలు : కరెంటు బిల్లులు ఇవ్వండి సారూ.. అంటూ విద్యుత్ శాఖ వారికి మొరపెట్టుకుంటున్నా, అధికారుల్లో చలనం లేదని మండలంలోని అక్కంపేట గ్రామస్తులు వాపోతున్నారు. సాధారణంగా ప్రతినెలా ఒకటి రెండు తేదీల్లో విద్యుత్ శాఖ సిబ్బంది మీటర్ రీడింగ్ నమోదు చేసి బిల్లులు ఇస్తారు. అయితే ఈనెలలో ఐదు రోజులు గడిచినా ఇంత వరకు కరెంటు బిల్లులు ఇవ్వలేదని, దీని వల్ల మీటర్ రీడింగ్ పెరిగి శ్లాబ్ సిస్టం మూలంగా తమపై అదనపు భారం పడుతోందని వినియోగదారులు వాపోతున్నారు.

మర్యాదపూర్వకంగా..




కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పలువురు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. పూల మొక్కను అత్తిపల్లి అనూప్‌రెడ్డి, కలికి శ్రీధర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

➡ కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ స్వర్ణ సుధాకర్‌బాబు, పార్టీ నేతలు కృష్ణ, నరసయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.

అశోక్‌రెడ్డికి పరామర్శ




కోవూరు: పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త అనపల్లి అశోక్‌రెడ్డి సతీమణి సులోచనమ్మ సోమవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన్ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నిరంజన్‌బాబురెడ్డి, రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, స్వర్ణ వెంకయ్య, తాటిపర్తి విజయ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, మిత్రరెడ్డి, అనూప్‌రెడ్డి, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

ముత్తుకూరు : హిందువులు పవిత్రంగా జరుపుకునే నాగుల చవితి పండగను మంగళవారం మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముత్తుకూరు, పంటపాళెం, వల్లూరు, బ్రహ్మదేవి, పైనాపురం, ఈపూరు, కృష్ణపట్నం, పిడతాపోలూరు, మామిడిపూడి, మునునూరువారిపాళెం, దువ్వూరువారిపాళెం, పోలంరాజుగుంట తదితర గ్రామాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పుట్టలకు పూజలు చేశారు. పుట్ట చుట్టూ తిరిగి మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాలు మధ్యాహ్నం వరకు కొనసాగాయి.

➡ మనుబోలు : మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున నాగదేవతకు పూజలు చేశారు. మండల కేంద్రంలోని మనుబోలమ్మ ఆలయం వెనుక వైపు పెద్ద చెరువు గట్టున ఉన్న నాగుల పుట్టకు మహిళలు పూజలు చేశారు. ఉదయమే తలస్నానం చేసి నాగులపుట్ట వద్దకు చేరుకున్న మహిళలు పాలు పోసి కోడిగుడ్లు, మొలకెత్తిన సజ్జలు, పాలపిండిని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం పక్కనే ఉన్న గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మ, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఫణీంద్రశర్మ, సుబ్రహ్మణ్యంశర్మ శాస్త్రోక్తంగా గ్రామదేవతలకు పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

➡ తోటపల్లిగూడూరు : మండలంలోని నాగుల పట్టల వద్ద మహిళలు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. నరుకూరు సమీపంలోని నాగుల పుట్ట వద్ద మహిళలు అధిక సంఖ్యలో పూజలు చేశారు.

➡ పొదలకూరు: నాగుల చవితి పర్వదినం సందర్భంగా మండలంలోని మహిళలు ఆయా గ్రామాలు, పట్టణానికి సమీపంలోని పుట్టల వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నోములు నోచుకున్న మహిళలు రోజంతా ఉపవాసం ఉన్నారు. ఉదయం పుట్ట వద్ద పాలు పోసి దీపాలను వెలిగించారు. శివాలయంలోని నాగుల శిలల వద్ద పూజలు చేసి ప్రసాదాలను అందజేశారు. స్థానిక నిమ్మమార్కెట్ యార్డుకు సమీపంలో నాగుల పుట్ట వద్ద మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఇందుకూరుపేట: మండలంలో నాగులచవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంగపట్నం, నరసాపురం, జగదేవిపేట తదితర గ్రామాల్లోని పుట్టల వద్ద పూజలు చేశారు.


మనుబోలు: పూజలు చేస్తున్న మహిళలు


ముత్తుకూరులో పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు


తోటపల్లిగూడూరు: నరుకూరు సమీపంలో..

క్లుప్తంగా

విద్యార్థినికి అభినందన


విద్యార్థిని శ్రావణిని అభినందిస్తున్న హెచ్‌ఎం

వెంకటాచలం : మండలంలోని గొలగమూడి వద్దనున్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని బి.శ్రావణిని పాఠశాల హెచ్‌ఎం బి.లక్ష్మీకామేశ్వరిదేవి, పీడీ షేక్.షబిక, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది మంగళవారం అభినందించారు. అనకాపల్లి జిల్లా తుమ్మపాళ్లలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–17 ఖోఖో పోటీల్లో నెల్లూరు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. నెల్లూరు జట్టులో గొలగమూడి విద్యార్థిని బి.శ్రావణి పాల్గొని ప్రతిభ చూపడంతో పాఠశాలలో శ్రావణిని అభినందించారు.

చౌకచర్లలో గ్రామసభ



విడవలూరు: రీ సర్వేలో తప్పులను సవరించేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చౌకచర్లలో మంగళవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో ఆమె మాట్లాడారు. రీ సర్వేలో పొరపాట్లను వీటి ద్వారా పరిష్కరించనున్నామని చెప్పారు. అనంతరం గ్రామస్తుల నుంచి అర్జీలను స్వీకరించారు. సర్పంచ్ వినోద్‌కుమార్, చిన్న వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు


విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, తిరిగి సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ


కొడవలూరు: యల్లాయపాళెంలో..

విడవలూరు: రామతీర్థం – 1లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సెక్టార్ సూపర్‌వైజర్ రమణి ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. స్టాక్‌ను తనిఖీ చేసి, పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. సిబ్బంది భారతి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం గిరిజన కాలనీ – 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి.. రామన్నపాళెం దళితవాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల తనిఖీ చేశారు. కేంద్రాల్లో పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వేణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పూర్తి స్థాయిలో గర్భిణులకు అందాలని జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ షైనీ పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీలో ఆశ డేను నిర్వహించారు. వైద్యాధికారులు బ్రహ్మేశ్వరనాయుడు, కిశోర్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఇందుకూరుపేటలో..

బెల్టుషాపుపై దాడి

దుత్తలూరు: మండలంలోని నందిపాడు సెంటర్‌లో నిర్వహిస్తున్న బెల్టు షాపుపై ఉదయగిరి ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. బత్తుల వేణు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై దీప్తి కరంత్ తెలిపారు.